

కొనసాగుతున్న ఉత్సవాలు
ప్రముఖ శైవక్షేత్రం ఉమామహేశ్వరంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.
వివరాలు 8లో ▸



శుభారంభం
గద్వాల క్రికెట్ పోటీల్లో మూడోరోజు హైదరాబాద్, బెంగళూరు జట్లు శుభారంభం చేశాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.1 /14.3
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలి తీవ్రత.. మధ్యాహ్నం వేళలో ఎండ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

19న ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

కందనూలు: విజ్ఞాన శాస్త్ర బోధనలో నూతన పోకడల అన్వేషణకు, సమర్థ బోధనకు సమర్పించే సెమినార్ పత్రాలు ఏ విధంగా రాయాలి అనే అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు ఈనెల 19న టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ టీ–సాట్ నెట్వర్క్, నిపుణ యానల్‌లో ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఫిబ్రవరి 11నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

కందనూలు: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు వచ్చేనెల 11 నుంచి 14వ తేది వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్ పరీక్ష 11వ తేది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ హయ్యర్ పరీక్ష 12, 13వ తేదిల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మ. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇక డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్ష 11వ తేదీ నుంచి 14వ తేది వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్లను www.bse. telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, టైలరింగ్, ఎంబ్రాయిరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ కుట్టు మిషన్‌లను వెంట తీసుకురావాలని తెలిపారు.

20న నల్లమలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రాక

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యమైన మన్ననూర్‌కు ఈ నెల 20న అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రానున్నారని అటవీశాఖ అధికారులు ఈశ్వర్, ప్రభాకర్, ఆదిత్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద నూతన హంగులతో ఏర్పాటు చేస్తున్న ఆరు విశ్రాంతి గదులు, సరికొత్త సఫారీ వాహనాలను ఆయన ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత

నాగర్‌కర్నూల్: జంతు సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, ఆయా చట్టాలను విధిగా పాటించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. జంతు సంరక్షణ కోసం ప్రజలు పాటించాల్సి నిబంధనల కరపత్రాన్ని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీధి కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువుల పట్ల కరుణతో వ్యవహరించాలని, వాటికి ఆహారం త్రాగునీరు అందించాలని తెలిపారు. పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను నరకకూడదని, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని, వన్య ప్రాణులు గ్రామాల సమీపాల్లోకి వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించుటకు సహకరించాలన్నారు. జంతు హింస చేయకూడదని అది చట్టరిత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి జివి రమేష్, జెడ్పీ సీఈఓ ఉష, డీఆర్‌డీఏ నర్సింగరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కల్పన సూచించారు. 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం కేవలం మైనార్టీ విద్యార్థినీలే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నాన్‌మైనార్టీలకు ప్రవేశపరీక్ష లేకుండా డిప్ పద్ధతిలో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ట్రెజరీ శాఖ నుంచి జీతాలు పొందే ఉద్యోగులు ఉద్యోగ సంక్షేమ నిధి నుంచి రుణాలు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోశాధికారి కోమల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యోగులు 2022–23 ఆర్థిక సంవత్సరానికి అవసరమున్న వారు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీలోగా ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

చిగురిస్తున్న ఆశలు

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు

- కొత్త జిల్లాల వారీగా క్యాడర్ పోస్టుల బదిలీలు ఉండే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 2,032 పోస్టులు ఖాళీలు
- ఎస్టీటీ నుంచి ఎస్‌ఏ, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంలలో 350, ఎస్ఏ నుంచి జీహెచ్‌ఎంకు 85 పదోన్నతులు



ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	ఖాళీలు
మహబూబ్‌నగర్	876	3,482	479
నాగర్‌కర్నూల్	845	3,390	450
వనపర్తి	535	2,023	316
నారాయణపేట	510	2020	470
జోగులాంబగద్వాల	475	1,971	317



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/అచ్చంపేట: చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. ఈ విషయమై ఉపాధ్యాయ వర్గాలు పలుమార్లు ప్రభుత్వానికి వినతులు సమర్పించడం, నిరసనలు తెలపడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో త్వరలోనే బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభిస్తామని.. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ప్రకటించడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2015లో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ప్రభుత్వం పదోన్నతులు చేపట్టింది. ఈ ప్రక్రియ పూర్తిచేసి చాలాకాలం కావడంతో వివిధ స్థాయిల్లో పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. గతేడాది ప్రారంభంలో కొత్త జిల్లాల వారీగా కేడర్ విభజనను చేపట్టి సిబ్బందిని కేటాయించింది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13వేల మంది ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2,032 ఎస్టీటీ, ఎస్ఏ పోస్టులు ఖాళీగా ఉండగా.. 630 ఎస్ఏ పోస్టుల్లో 350 వరకు పదోన్నతులు కల్పించేందుకు అవకాశం ఉంది. మిగతా పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లా, మల్టీజోన్‌లో బదిలీలు..

గతంలో బదిలీలు ఎప్పుడు జరిగినా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగేవి. ఇప్పటి నుంచి కొత్త జిల్లాల ప్రాతిపదికన మాత్రమే జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 350 మంది ఎస్టీటీ ఉపాధ్యాయులు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు, ఎస్ఏలుగా, 85 మందికి పైగా ఎస్ఏలు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జీహెచ్‌ఎం పూర్తిగా మల్టీజోనల్ పోస్టు కావడంతో 15 జిల్లాల్లో వారు ఎక్కడికైనా బదిలీ కావచ్చు. ఇక ఉమ్మడి జిల్లాలోని 68మండలాలకు ఎంఈఓలను సీనియర్ జీహెచ్‌ఎంల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏడుగురు ఎంఈఓలుగా పని చేస్తుండగా మిగతా పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా.. కోర్టు కేసుల కారణంగా ఎంఈఓ, జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయడం లేదని సమాచారం. అలాగే డైట్ కళాశాల, బీఈడీ కళాశాలల్లో కూడా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాల్సి ఉంది. కానీ వాటిని కూడా భర్తీ చేయడం లేదని తెలుస్తోంది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ప్రభుత్వం చాలా కాలం తర్వాతం బదిలీలు, పదోన్నతులు కల్పించడంపై నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు. పదోన్నతులు లేకపోతే చాలా మంది ఉన్న పోస్టుల్లోనే రిటైర్ అయ్యే అవకాశం ఉంది. అలాగే స్పౌజ్ విషయంలో రాష్ట్రంలో 19 జిల్లాల వారికి మాత్రమే బదిలీకి అవకాశం ఇచ్చారు. మిగిలిన వారికి కూడా అవకాశం ఇవ్వాలి. సీనియార్టీ, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి న్యాయం చేయాలి. – కృష్ణుడు, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

హర్షణీయం



పదోన్నతులపై ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వం కృషి ఫలించింది. అలాగే పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ కోర్టు ఉత్తర్వులకు లోబడి క్లియర్ చేస్తే బాగుంటుంది. 317లో అన్యాయం జరిగిన వారికి కూడా ఈ ప్రక్రియ ప్రారంభం కాకముందే పరిష్కరిస్తే బాగుంటుంది. – నారాయణగౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రయాణం చేయలేక.. సెలవులో ఉన్నా..



నేను పుట్టి పెరిగింది పాలమూరులోనే. అయినా 317లో నన్ను నారాయణపేట జిల్లాకు బదిలీ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట మారుమూల ప్రాంతానికి ప్రయాణం చేయడంలో అనారోగ్య సమస్యలు తలెత్తి ఆరు నెలలుగా మెడికల్ లీవ్‌లో ఉన్నా. పాఠశాలకు వెళ్లలేక, వేతనం పొందలేకపోతున్నా. నా భర్త కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబం ఉద్యోగం భారంగా మారింది. – ప్రణీత, ఉపాధ్యాయురాలు, నారాయణపేట

జీఓ నంబర్ 317తో న్యాయం జరిగేనా..

రాష్ట్రంలోని 19 జిల్లాల్లో స్పౌజ్ కేసులకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం.. మిగిలిన జిల్లాలను బ్లాక్ లిస్టులో ఉంచింది. ఈ క్రమంలో వేర్వేరు జిల్లాల్లో ఉన్నా భార్యాభర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. అలాగే సీనియార్టీ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు ఉపాధ్యాయులు అన్యాయం జరిగిందని కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 120 మందికి పైగా ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ప్రభుత్వం తాజాగా చేపట్టనున్న బదిలీల్లో జీఓనంబర్ 317 బాధితులకు కొంత ఊరట కలుగుతుందని భావించినప్పటికీ అలాంటి సూచనలు కనిపించడం లేదు. కానీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాత్రం 317 బాధితులకు న్యాయం చేసిన తర్వాతే మిగతా ప్రక్రియ చేపడితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 950మంది ఎదురుచూపులు చూస్తున్నారు.

సీనియార్టీ జాబితా అందజేయాలి

కందనూలు: ఉపాధ్యాయ సీనియార్టీ జాబితాతో పాటు తమ పరిధిలోని ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు వెంటనే అందజేయాలని డీఈఓ గోవిందరాజులు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టనున్న బదిలీల ప్రక్రీయల్లో ఇప్పటికే షెడ్యూల్ విడుదలైందని, తమ పరిధిలోని సీనియార్టీ కలిగిన ఉపాధ్యాయులు, ఖాళీల వివరాల జాబితాను త్వరగా పంపించాలని ఆదేశించారు.

ఏఎంఓ బదిలీ

ఇదిలాఉండగా, డీఈఓ కార్యాలయ ఏఎంఓ (అకాడమిక్ మానిటరింగ్ అధికారి) సతీష్ కుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో బదిలీపై వెళ్తున్న సతీష్ కుమార్‌ను డీఇఓ గోవిందరాజులు, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారిగా సేవలందించి, పాఠశాలల పర్యవేక్షణతో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎంతో కృషిచేయారని కొనియాడారు. ఏసీ రాజశేఖర్ రావు, నోడల్ అధికారి కుర్మయ్య, సెక్టొరిల్ అధికారి బరపటి వెంకటయ్య, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



అచ్చంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్షా సమావేశాల్లో కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం/అచ్చంపేట/కల్వకుర్తి టౌన్: సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు అచ్చంపేట, కల్వకుర్తిలో కంటివెలుగుపై వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్ష నిర్వహించే విధంగా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేయగా క్షేత్రస్థాయిలో వాటిని అమలు పరిచేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఒక్కో బృందానికి ప్రశ్నలు వేసి సన్నద్ధత పై ఆరా తీశారు. తమ బృందంలో ఏ సభ్యులు ఎలాంటి సన్నద్ధత చేశారు, కంటి వైద్య శిబిరానికి అవసరమైన మౌళిక వసతులు శిబిరానికి కావాల్సిన స్థలం ఎంపిక, బృందానికి అవసరమైన వాహనాలు సమకూర్చుకోవడం, వచ్చే జనాలకు షామియానా, టేబుళ్లు, కుర్చీలు, విద్యుత్ సౌకర్యం, మరుగు దొడ్ల సౌకర్యం వంటి ఏర్పాట్లు చేశారా అని ప్రశ్నించారు. కంటి పరీక్షల యంత్రాలు అన్ని వచ్చాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 19న ప్రారంభం కానున్న కంటివెలుగు వైద్య శిబిరాల ఏర్పాటుకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి

మొదటి విడత కంటివెలుగు జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచిందని ఈ సారి కార్యక్రమంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. మండల అభివృద్ధి అధికారులు తమ మండల పరిధిలో జరిగే ఈ కార్యక్రమాలకు అన్ని వసతులు సమకూర్చడంలో ముఖ్య భూమిక పోషించడమే కాకుండా క్యాంపులు నిర్వహించినన్ని రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి సజావుగా సాగేవిధంగా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయాన్నే 9.00 గంటలకు కంటివెలుగు వైద్య శిబిరం ప్రారంభం కావాలని అందుకు సంబంధించిన ఫొటో ప్రతి బృందం నుంచి ఉదయం 9.00 గంటలకు వాట్సాప్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం మెడికల్ ఆఫీసర్లకు కంటివెలుగు డేటా ఎంట్రీకి సంబంధించిన సిమ్ కార్డులను అందజేశారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సుధాకర్ లాల్, డీపీఓ కృష్ణ, ఆర్డీఓలు పాండునాయక్, నాగలక్ష్మి, రాజేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు బల్‌రాంనాయక్, జయంత్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్

విస్తృత ప్రచారం నిర్వహించాలి

కంటి వెలుగు శిబిరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఎవరు ఎప్పుడు ఏ కేంద్రానికి వెళ్లాలో తెలియజేయాలని ఆదేశించారు. కల్వకుర్తి డివిజన్‌లో 7 బృందాలు 78 లోకేషన్లలో వైద్య శిబిరాలు, అచ్చంపేట డివిజన్ పరిధిలో 205 లోకేషన్లకు 16 బృందాలు, నాగర్‌కర్నూల్ డివిజన్‌లో 155 లోకేషన్లకు 17 బృందాలు, కొల్లాపూర్‌లో 93 లోకేషన్లలో 10 బృందాలు 100 పనిదినాల పాటు కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏ బృందం ఎప్పుడు ఎక్కడ ఎన్నిరోజులు క్యాంపు నిర్వహించాలి అనే ప్రణాళిక సిద్ధం చేసి రెండువారాల ముందే ఇవ్వడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, రెవెన్యూశాఖ సమన్వయంతో పాటు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పని చేస్తే కంటివెలుగు కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు.

కనులపండువగా ప్రభోత్సవం




కొల్లాపూర్ రూరల్: సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రభోత్సవం (సింహవాహన సేవ) కనులపండువగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరల నడుమ అర్చకులు ఉదయం దీక్షాహవనం, లక్ష్మీగణపతి హోమతర్పణం, సతీసమేత ఆదిత్యాది నవగ్రహ, ఆంజనేయ, వాస్తు, సర్వతోభద్రహవనములు నిర్వహించారు. సాయంత్రం వందలాదిగా తరలివచ్చిన భక్తజనం నడుమ సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. బుధవారం (నేడు) సాయంత్రం రథోత్సవం నిర్వహించనుండగా.. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మందు కల్లు.. కల్తీ మద్యం

అ(న)ధికార దందా..!

- ముఖ్య నేతలే సూత్రధారులు
- ద్వితీయ శ్రేణి నాయకులే పాత్రధారులు
- ఏదేళ్ల క్రితంతో పోలిస్తే మారిన ట్రెండ్
- అంతా ఖాకీలతోనే రాజ'కీ'యం
- వారితోనే సెటిల్మెంట్లు.. ఆ తర్వాత వాటాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కల్తీ మద్యం.. మందు కల్లు దందా ఉమ్మడి పాలమూరులో జోరుగా సాగుతోంది. దీంతో పాటు తెలంగాణ, కర్ణాటకకు చెందిన మద్యం యథేచ్ఛగా జిల్లా సరిహద్దులు దాటుతోంది. ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నేతల కనుసన్నల్లోనే మాఫియా పేట్రేగిపోతోంది. ఎక్కడికక్కడ ద్వితీయ శ్రేణి నాయకులే నేరుగా వ్యవహారాలు చక్కబెడుతుండడంతో వారికి ఎదురేలేకుండా పోయింది. అడ్డుకోవాల్సిన పోలీస్, ఆబ్కారీ అధికారులతోనే ముఖ్య నేతలు రాజ'కీ'యం నెరుపుతున్నారు. వారినే సెటిల్మెంట్లకు పురిగొల్పుతుండడంతో పరిస్థితులు మరింతగా దిగజారినట్లు తెలుస్తోంది. పట్టుకుంటే సెటిల్మెంట్.. లేకుంటే ఒత్తిళ్లు సర్వసాధారణం కావడంతో పలువురు 'ఖాకీలు' చూసీచూడనట్లు వదిలేయడమే పనిగా ఎంచుకున్నట్లు సమాచారం.

ద్వితీయ శ్రేణి నాయకులే..

▪ 2022లో కర్ణాటక లిక్కర్‌ను తెలంగాణ మీదుగా ఏపీకి అక్రమంగా రవాణా చేస్తున్న క్రమంలో 24 కేసులు నమోదయ్యాయి. అధికారులు 32 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 3,223 లీటర్ల లిక్కర్ సీజ్ చేశారు. 19 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎక్కువగా కర్ణాటక సరిహద్దులోని అయిజ పట్టణం, గట్టు మండలంలోని బలిగెర చెక్‌పోస్టు వద్దే పట్టుబడ్డాయి. మద్యం అక్రమ రవాణాకు ఇవే నిదర్శనం కాగా.. పట్టుబడిన వారిలో అధిక సంఖ్యలో ప్రధాన పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులే ఉన్నట్లు తెలుస్తోంది.

▪ 2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు కల్తీ కల్లుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో కేవలం 16 కేసులు నమోదు కాగా.. 12 షాపుల లైసెన్స్ రద్దు చేశారు. ఇందులో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో మూడు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 12, వనపర్తిలో ఒక్క కేసు నమోదైనట్లు ఆబ్కారీ శాఖ రికార్డులు చెబుతున్నాయి. కల్తీ కల్లుకు పేరొందిన గద్వాల జిల్లాలో ఒక్క కేసు నమోదు కాకపోవడం అందరినీ నివ్వెరపరుస్తోంది. కల్లులో మత్తు కోసం కలిపే ఆల్ప్రాజోలం, సీహెచ్‌ను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఇద్దరే కీలకంగా వ్యవహరిస్తూ అన్నీ చక్కబెడుతున్నట్లు తెలిసింది. అందుకే ఎక్కువగా కేసులు నమోదు కావడం లేదని తెలుస్తోంది. మందుకల్లు వ్యాపారంలో ఎక్కువగా ప్రధాన పార్టీకి చెందిన గ్రామ, మండల స్థాయి నాయకులే ఉన్నట్లు సమాచారం.

ట్రెండ్ మారింది...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మందు కల్లుదందా జరిగినప్పటికీ.. వాటి నిర్వాహకులు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తెరవెనుక ఉండే నడిపించేవారు. అప్పట్లో తెలంగాణ ప్రాంతంలోని పలు జిల్లాల్లో సదరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు నెలనెలా వాటాలు అందేవని సమాచారం. ప్రస్తుతం ట్రెండ్ మారింది. మందు కల్లు డిపోలు అధికసంఖ్యలో ద్వితీయ శ్రేణి రాజకీయ నేతల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యనేతలు సూచించిన ప్రకారం నెలనెలా మామూళ్లకు బదులు రాజకీయ నేతల సమావేశాలు, సభల నిర్వహణకు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల వారు చెప్పిన వ్యక్తులకు నెలానెలా ఇస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ సెటిల్మెంట్‌లు, వసూళ్లలో పలువురు పోలీసులు, ఎక్సైజ్ అధికారులదే కీలకపాత్ర అని తెలిసింది.

ఓ లిక్కర్ కింగ్ .. ఓ పీఏ.. ఓ నేత

గద్వాల నియోజకవర్గంలోని కేటీదొడ్డి, ధరూర్ మండలాల మీదుగా కర్ణాటక మద్యం అక్రమంగా సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ట్రాక్టర్‌లో పైన వరి గడ్డి కప్పి కింద కర్ణాటక లిక్కర్‌ను భారీగా తరలిస్తుండగా ధరూర్‌లో పోలీస్, ఆబ్కారీ అధికారులు పట్టుకున్నారు. ఈ లిక్కర్ అక్రమ రవాణాలో పాతపాలెం గ్రామానికి చెందిన ప్రధాన పార్టీ నాయకుడు కీలక సూత్రధారి. దీంతో జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధికి అనధికార పీఏగా వ్యవహరిస్తున్న అతడి సోదరుడు జోక్యం చేసుకున్నా.. అధికారులు వినలేదని సమాచారం. ఈ క్రమంలో సదరు ప్రజాప్రతినిధి నేరుగా ఫోన్ చేసి బెదిరించడంతో వారు చేసేదేమీలేక మిన్నకుండిపోయినట్లు సమాచారం. అప్పటి నుంచే సదరు లిక్కర్ కింగ్‌కు అధికార యంత్రాంగానికి మధ్య స్నేహబంధం చిగురించి బలపడినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత అతడి కార్యకలాపాలు ఉమ్మడి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో పెరిగిపోయాయి.

ఓ ముఖ్య నేత అండతో.. !

పాతపాలెం గ్రామానికి చెందిన ప్రధాన పార్టీ నాయకుడు, లిక్కర్ కింగ్ మందు కల్లు, నకిలీ లిక్కర్ వ్యాపారంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అనేక పర్యాయాలు కర్ణాటక నుంచి ఏపీకి లిక్కర్‌తోపాటు కల్లులో వినియోగించే మత్తు పదార్థాలైన ఆల్ప్రాజోలం, సీహెచ్‌ను తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ఈ మేరకు ఇరు ప్రాంతాల్లోనూ కేసులు నమోదయ్యాయి. తన స్వగ్రామంలోని ఓ ఇంట్లో నకిలీ లిక్కర్ తయారు చేస్తూ దొరికాడు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినా.. పెద్ద ఎత్తున ఆఫర్ రావడంతో ఆయనను అందులో నుంచి తప్పించి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత మద్యం అక్రమ రవాణాలో పట్టుబడగా.. నాటకీయ పరిణామాల మధ్య అతడిని బైండోవర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్‌లో 750 కిలోల సీహెచ్‌ను కర్నూలుకు తరలిస్తున్న క్రమంలో భూత్పూర్ సమీపంలో పట్టుకున్నారు. దీంతో అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగానికి రంగం సిద్ధమైంది. కాగా గద్వాల జిల్లాకు చెందిన ఓ నేత నేరుగా రంగంలోకి దిగినట్లు సమాచారం. అయినా అధికార యంత్రాంగం ఈ సారి తప్పదు అని తేల్చడంతో ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన ముఖ్య నేతను ఆశ్రయించినట్లు సమాచారం. ఆయన అండగా నిలవడంతో అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగాన్ని విరమించుకున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

లింగాల: మండలంలోని పాతరాయవరానికి చెందిన కాట్రాజు మంతయ్య (58) పంటకు అక్రమంగా వేసిన విద్యుత్ కంచె తీగ తగిలి మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంతయ్య గ్రామ సమీపంలోని గువ్వగుట్ట ప్రాంతంలో మేకలను మేపునకు తోలుకెళ్లాడు. కొన్ని మేకలు పక్కనే ఉన్న వేరుశనగ పంటలోకి వెళ్లగా బయటకు తరిమేందుకు పరుగు తీశాడు. అప్పటికే పందుల నుంచి పంటను రక్షించడానికి వేసిన అక్రమ విద్యుత్ కంచె తీగ తగటడంతో ఆయనతో పాటు ఒక మేక కూడా అక్కడికక్కడే మృతిచెందాయి. మంతయ్యకు భార్య ఈశ్వరమ్మ, ఆరుగురు సంతానం ఉన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: ప్రేమలో విఫలమయ్యానన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కుర్వపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. కుర్వపల్లికి చెందిన గుత్పల శ్రీశైలం(22) ఓ యువతిని ప్రేమించాడు. అయితే యువతి యువకుడిని ఇష్టపడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మంగళవారం మృతుడి తల్లి జగదాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిమెంట్ యంత్రం పడి కార్మికుడు మృతి

బాలానగర్: సిమెంట్ ఇటుకలు తయారు చేసే మిషన్ కార్మికుడిపై పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన బాలానగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ (20) కొంతకాలంగా మండల కేంద్రంలోని పాతపెట్రోల్ బంక్ సమీపంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసే మిషన్ కార్మికుడు లక్ష్మణ్‌పై పడి తలకు, కడుపు వద్ద గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

'మైక్' బంద్ చేయడంపై ఘర్షణ

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: మైక్ బంద్ చేశాడనే విషయంలో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చర్లపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి భజన కార్యక్రమంలో యాదయ్య (40) తండ్రి రంగయ్య పాటలు పాడుతున్నాడు. ఈ సమయంలో అదే గ్రామానికి నవీన్, అనిల్ మైక్‌ను ఆఫ్ చేశారు. విషయం తెలుసుకున్న మరుసటి రోజు ఎందుకు ఆపివేశారని యాదయ్య వారిని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. ఈ క్రమంలో యాదయ్యను పక్కకు తీసుకెళ్లి చితకబాదడంతో తీవ్రంగా గాయపడిన ఆయన అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. యాదయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు నవీన్, అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు

బిజినేపల్లి: తాగి వేధిస్తున్నాడని పాతప్రియుడితో కలిసి తాజా ప్రియుడిని సోమవారం హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులు వట్టెం గ్రామానికి చెందిన కృష్ణమ్మ, జడ్చర్లకు చెందిన శ్రీనివాస్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై కృష్ణ ఓబులరెడ్డి మంగళవారం తెలిపారు.

వరి పంటల పరిశీలన

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గర శివారులో సాగుచేసిన వరి పంటలను బుధవారం ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డా.రామకృష్ణ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉండటంతో చౌడు నేలల్లో సాగు చేసిన పంటలు ఎండిపోయినట్లు గుర్తించామన్నారు. అలాగే కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు సోకిందని.. నారుమడులు, పంటలకు ఉదయం నీరు పెట్టి సాయంత్రం తీసివేయాలని సూచించారు. కాండం కుళ్లు తీవ్రంగా ఉంటే హెక్సాకోనజోల్ 400 మి.లీ. లేదా ట్రైఫైకొనజోల్ 200 మి.లీ. ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు సోకిన పంటలకు నాటివో 80 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. ఆయన వెంట రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహులు, గ్రామ రైతులు ఉన్నారు.



ఘనంగా ఉమామహేశ్వరుడి ఉత్సవాలు



ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీ

అచ్చంపేట: ప్రముఖ శైవక్షేత్రం ఉమామహేశ్వరంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి బారులుతీరారు. ఉదయం బలిహరణం, నీరాజనం, మంత్ర పుష్పం, సాయంత్రం సదస్యం, అశ్వవాహన సేవ నిర్వహించారు. పాపనాశని గుండం నుంచి ఆలయం వరకు అశ్వవాహనంపై ఉమాసదులను ఊరేగించారు. భక్తులు శివనామ స్మరణతో నల్లమల కొండలు మార్మోగాయి. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు చేసి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆర్టీసీ అధికారులు కొండపైకి ప్రత్యేక బస్సులు నడిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో క్యూలైన్‌లో పంపేందుకు వలంటీర్లను నియమించారు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో ఎస్సై గోవర్ధన్, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. కొండపైకి ఆర్టీసీ బస్సులు తప్ప ఇతర వాహనాలను అనుమతించడం లేదు.



క్యూలైన్‌లో నిలిచి ఉన్న భక్తులు



భజన చేస్తున్న భక్తులు

బియ్యం అక్రమ రవాణాపై కేసు నమోదు



డీసీఎంను సీజ్ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గురురాజారావు

మాగనూర్: మండల కేంద్రంలోని ఒమర్ రైస్‌మిల్లు నుంచి సోమవారం డీసీఎంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా, రెవెన్యూ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గురురాజారావు పరిశీలించి రేషన్ బియ్యంగా గుర్తించారు. వాటిని తరలించేందుకు రైసుమిల్లు యజమానికి ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. ఈ సందర్భంగా ఆయన రైసుమిల్లును కూడా తనిఖీ చేయగా అక్కడ పెద్దమొత్తంలో ప్రభుత్వానికి అందించాల్సి రేషన్ నిల్వ ఉండటం గుర్తించారు. ఆ బియ్యాన్ని కర్నూల్ రైస్ అనే బ్రాండెడ్ బ్యాగులతో పాటు ప్రైవేట్ బ్యాగులో ఈ బియ్యం నింపి కర్ణాటకలోని రాయచూర్‌కు తరలిస్తున్నట్లు కనిపెట్టారు. డీసీఎంలో దాదాపుగా 70క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని తెలిపారు. డీసీఎం యజమాని మహ్మద్‌హుస్సేన్‌పై, రైస్‌మిల్ యజమాని ఒమర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమామహేశ్వర కొండపైకి అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం రంగాపూర్ నుంచి కొండపైకి ఓ బస్సు బయలు దేరింది. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో మధ్యలోనే మొరాయించింది. దీంతో అందులోని ప్రయాణికులు కొండపైకి నడుచుకుంటూ వెళ్లారు. కొన్ని గంటల వరకు మొరాయించిన బస్సు మూలమలుపు వద్దనే ఉండటంతో వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఫిట్‌నెస్ లేని బస్సులను కొండపైకి పంపడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆదాయం పెంచుకోవడంపై పెట్టే దృష్టి వసతులు కల్పించడంలో అచ్చంపేట ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారని అన్నారు.

మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లోని అర్యన్ మెడికల్ షాపులో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చుట్టుపక్కల వారు చూసి యజమానికి సమాచారం అందించారు. ఆయన షాపువద్దకు చేరుకుని ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ మందులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్‌ఐ.యుగంధర్ రెడ్డి, ఆర్‌ఐ మధు పంచనామా నిర్వహించారు. దాదాపు రూ.30లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని మెడికల్ షాపు యజమాని ఖలీల్ తెలిపారు.



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద.. సెక్యూరిటీ గార్డ్ హఠాన్మరణం



రహదారిపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు, సంఘం నాయకులు



నిలిచిన వాహనాలు

- నష్ట పరిహారం చెల్లించాలంటూ బాధిత కుటుంబ సభ్యుల రాస్తారోకో
- మద్దతు పలికిన సిబ్బంది.. నిలిచిన రాకపోకలు

అలంపూర్: నష్ట పరిహారం చెల్లించాలంటూ పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నాలుగు గంటల పాటు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు జిల్లా పంచలింగాలకు చెందిన సమద్ మియా (55) 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తుండేవారు. రోజులాగే విధుల్లో ఉండగా మంగళవారం ఉదయం 7.40 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కూలిపోయాడు. అక్కడే ఉన్న మిగతా సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని తిరిగి టోల్‌ప్లాజా వద్దకు తీసుకొచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. టోల్‌ప్లాజా సిబ్బంది సైతం బాధిత కుటుంబానికి మద్దతుగా నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాసు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఈదన్న, తెలంగాణ ట్రాన్స్‌పోర్టు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకుడు కిషోర్ కుమార్ అక్కడకు చేరుకొని రూ.14 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్‌విట్ కంపెనీ మేనేజర్ బాలగణేష్ వారితో మాట్లాడారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భార్యకు పింఛన్, సంస్థ నుంచి అందాల్సిన అన్నింటిని అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.60 వేలు కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం రాస్తారోకో విరమించి మృతదేహాన్ని ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకెళ్లారు. టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడు పీటర్, కార్యదర్శి మద్దయ్య, రాజశేఖర్, వెంకటేశ్, శేషన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్ర, సీపీఎం నాయకుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

కోడేరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా అంతర్రాష్ట్ర బండ లాగుడు పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను పీసీసీ సభ్యుడు అభిలాష్‌రావు ప్రారంభించారు. ఆరు జతల వృషభ రాజులు పోటీలో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.60వేలు కర్నూల్ జిల్లా నంద్యాల నియోజకవర్గం కొత్తకోటకు చెందిన రామ్మోహన్ ఎద్దులు, రెండో బహుమతి అనంతాపూర్ జిల్లా కృష్ణాపురంకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, నంద్యాలకు చెందిన నాగయ్య ఎద్దులు సమానంగా బండను లాగడంతో వారిద్దరికి రూ.45 వేలు అందజేశారు. నాల్గవ బహుమతి రూ.30 వేలు వనపర్తి జిల్లా పెద్దదగుడకు చెందిన గోపాలకృష్ణ, ఐదవ బహుమతి రూ.20 వేలు గద్వాల జిల్లా అయిజ చెందిన భాస్కర్‌గౌడ్, ఆరో బహుమతి రూ.10 వేలు మానవపాడుకు చెందిన రవీందర్‌రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, అబ్దుల్ కరీం, రామన్న, అశోక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



అచ్చంపేటలో గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

- రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గాలో వేడుకలు
- అర్ధరాత్రి తర్వాత దర్గాకు చేరనున్న గంధం



అచ్చంపేటలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు



అమ్రాబాద్‌లో గంధం ఊరేగింపు..

అచ్చంపేట/అమ్రాబాద్/ఉప్పునుంతల/మన్ననూర్: మండలంలోని రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గా గంధోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జామే మసీదు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 9.30గంటలకు రంగాపూర్ ఉర్సు గంధోత్సవం ప్రారంభమైంది. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ హాజరై ప్రార్థనలు నిర్వహించారు. అచ్చంపేట పట్టణానికి చెందిన పటేల్ వంశీయులైన నారాయణ ప్రసాద్ చిన్న కుమారుడు మన్నూప్రసాద్ 18 ఏళ్లుగా గంధం వేడుకలు సంప్రదాయకంగా నిర్వహిస్తున్నారు. మారుతినగర్‌లోని మహెబెల్లి ఇంటి నుంచి ప్రత్యేక కారుపై అలంకరించిన పంకాను మన్నూప్రసాద్ ఇంటికి చేరిన తర్వాత, శేఖ పటేల్ ఇంట్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధోత్సవం బయలు దేరింది. విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకంగా తయారు చేసిన డీసీఎం వ్యాన్‌లో గంధాన్ని పట్టణంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఏటా జనవరి 17న రాత్రి అచ్చంపేట నుంచి బయలు దేరిన గంధం అర్ధరాత్రి దాటిన తర్వాత రంగాపూర్ దర్గా చేరుకోగానే ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గంధోత్సవం తిలకించేందుకు మంగళవారం రాత్రి రంగాపూర్ చేరుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉర్సుకు హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా ప్రజలు తరలివచ్చారు. అచ్చంపేట పట్టణంలోని నారాయణ ప్రసాద్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీ. అచ్చంపేటతో పాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, బొమ్మన్‌పల్లి, నాగర్‌కర్నూల్, లింగాల, ఉప్పునుంతల, తెల్కపల్లి, కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తారు. అమ్రాబాద్, బొమ్మన్‌పల్లి నుంచి వచ్చే గంధం గుర్రంపై రావడం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. గంధోత్సవ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు పోకల మనోహర్, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడు, కౌన్సిలర్లు మన్నూప్రసాద్, అంతటి శివ, తగురం శ్రీనివాసులు, ఆకుల వెంకటేష్, జామేమసీదు కమిటీ అధ్యక్షులు సిద్దిక్, కార్యదర్శి పసియొద్దీన్, అమీనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల నుంచి ఊరేగింపు

హజ్రత్ నిరంజన్‌షావలి గంధోత్సవాన్ని మంగళవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో ముందుగా ముస్లింలు గంధోత్సవ భవన్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుర్రానికి దట్టీలు చుట్టి ప్రత్యేకంగా అలంకరించారు. మరికొందరు తగ్బీర్‌ను నెత్తిన పెట్టుకొని గంధోత్సవం(గుర్రం) వెంట నడిచారు. గంధోత్సవం సందర్భంగా యువకుల నృత్యాలతో ముందుకు కదిలారు. ఉప్పునుంతల నుంచి ముస్లింలు మంగళవారం రాత్రి రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా వద్దకు గంధోత్సవాన్ని ఘనంగా తీసుకెళ్లారు.

స్పష్టమైన హామీ ఇచ్చి పనులు చేపట్టాలి



ధర్నా చేస్తున్న బాధితులు

- రెండో రోజు కొనసాగిన రోడ్డు విస్తరణ బాధితుల ధర్నా
- మున్సిపల్ కమిషనర్ హామీతో ధర్నా విరమణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసులు

కోస్గి: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్డు శివాజీ చౌరస్తా నుంచి సయ్యద్‌పహడ్ దర్గా వరకు విస్తరణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇళ్లు కోల్పోతున్న పలువురు బాధితులు రెండో రోజు మంగళవారం సైతం ధర్నాకు దిగారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులవుతున్న పేదలను గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండానే ఇళ్ల కూల్చివేతకు సిద్ధమవుతున్నారని, ఈ విషయంలో పేదలకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతనే రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. బాధితులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు సైతం ధర్నాకు దిగారు. ధర్నాతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి ధర్నాను విరమింపజేసేందుకు ప్రయత్నించినా బాధితులు వినకపోవడం స్పష్టమైన హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామని భీష్మించారు. అధికారులు స్పందించకపోవడంతో ఏకంగా మున్సిపల్ కార్యాలయంలోకి దూసుకుపోయేందుకు ప్రయత్నించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు బాధితులతో మాట్లాడుతూ వారం రోజుల్లోగా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేకు సమస్యను వివరించి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

టమాటలో సస్యరక్షణ చర్యలు



టమాటను ఆశించిన ఆకు, టమాట



టమాట పంటకు ఆశిస్తున్న పురుగు

అలంపూర్: టమాట పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. జిల్లాలో ఉన్న అనుకూల పరిస్థితుల్లో రైతులు టమాట పంట సాగుచేశారు. టమాటలో ఆకుతొలుచు పురుగు ఆశించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పురుగు ఆశిస్తే పంట ఆకులను పూర్తిగా తినివేస్తుంది. ఆకులనే కాకుండా మొగ్గలు, కాయలకు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. దీనివలన 50 నుంచి వందశాతం వరకు నష్టం జరగవచ్చని తెలిపారు. దీనిని ఆకుతొలుచు పురుగు లేదా పినివామ్ అంటారని పేర్కొన్నారు. దీని శాస్త్రీయ నామం టూట అబ్సలూట్. ఇది అమెరికా ప్రాంతానికి చెందినది. ప్రస్తుతం మన ప్రాంతంలోనూ ఈ పురుగును గుర్తించారు.

నష్టపరిచే విధానం..

రెక్కల పురుగు 7 నుంచి 8 మిల్లీమీటర్ల పొడవు ఉండి గోదుమ లేదా బూడిద రంగులో ఉంటాయి. తల్లి పురుగులు లేత ఆకుల కింద, తొడిమల కింద సుమారు 200 గుడ్ల వరకు పెడుతుంది. వీటి నుంచి వచ్చిన పిల్ల పురుగులు లేత ఆకులపై వంకర టింకర సొరంగాలు చేసి ఆకు పచ్చని పదార్థాన్ని తినివేస్తాయి. వీని వలన కణాలు తెల్లబారిపోతాయి. ఈ పురుగు లేత ఆకు కాండం, మొగ్గలు, పచ్చి కాయలపై రంధ్రాలు చేసి ఆశించడంతో కాయ కుళ్లి వాసన వస్తుంది. ఈ పురుగులు తక్కువ సమయంలో ఎక్కువ పునరుత్పత్తి జరిగి అధిక సంఖ్యలో ఉండటంతో అధిక నష్టం జరుగుతుంది.

నివారణ..

పురుగు లార్వాలు ఆకుల లోపల ఉండటంతో రసాయన మందులతో నివారించడం చాలాకష్టం. సమగ్ర సస్యరక్షణ చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి.

- ప్రతిసారి ఒకే పొలంలో టమాట పంటను సాగు చేయరాదు.
- పంట చుట్టూ కంచె పంటగా జొన్న, మొక్కజొన్న నాలుగు సాళ్లు నాటితే వాటిపై ఈ పురుగులు చేరుతాయి. దీంతో కొంత వరకు పురుగులను నివారించవచ్చును.
- పొలం వెంబడి, గట్ల వెంట ఉమ్మెత్త మొక్కలు లేకుండా చూడాలి. లేకపోతే ఈ మొక్కలు పురుగులకు ఆతిథ్యం ఇస్తాయి.

లింగాకర్షక బుట్టలు..

- మగ పురుగులను ఆకర్షించే లింగాకర్షక బుట్టలను ఎకరానికి ఎనిమిది అర్చుకుంటే మగ పురుగులను నియంత్రించవచ్చును. ఎందు కంటే మగ పురుగులు లేకపోతే సంతానోత్పత్తి వృద్ధికాక పురుగు మనుగడ సాధించ లేదు.

పసుపు రంగు అట్టలకు జిగురు :

ఏ పురుగునన్నై ఆకర్షించే గుణం పసుపు రంగుకు అట్టలకు అధికంగా ఉంటుంది. పసుపు రంగు అట్టలకు గ్రీసు, జిగురు పట్టించి పొలంలో కర్రలకు కడితే రెక్కల పురుగులు వాటికి అతుక్కొని చనిపోతాయి.

రసాయన పద్ధతులు..

ఈ పురుగులకు రసాయనాలకు తట్టుకునే శక్తి ఉంటుంది. ఎక్కువ సార్లు ఒకే రసాయనం వాడకుండా సూచించిన మందులను మార్చి పిచికారీ చేసుకోవాలి. 1) సైనోసాడ్ 0.3 మి.లీ, 2) కొరాజెన్ 0.3 మి.లీ, 3) డెల్టా మెత్రిన్ 0.5 మి.లీ 4) ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ, 5) వేపనూనె 5మి.లీ లేదా, 6)కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 1.5 గ్రాములను లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళ పిచికారీ చేయాలి.

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019.


ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
అచ్చంపేట : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజ్‌మెంట్

బొగ్గు కొరతతోనే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ బంద్

పీజీసీఎల్ లైన్లను వేరే విద్యుత్ కొనుగోళ్లకు వాడుకుంటున్నాం

- బకాయిలు, ధరల వివాదంతో విద్యుత్ ఆగలేదు
- 'సాక్షి' కథనంపై ట్రాన్స్‌కో యాజమాన్యం వివరణ
- బకాయిలు, వివాదాలతోనే ఆగినట్టు ఈఆర్సీకి డిస్కంల వివరణ
- పరస్పర విరుద్ధ కారణాలు తెలిపిన తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కంలు
- బకాయిలు చెల్లిస్తేనే సరఫరా పునరుద్ధరిస్తామన్న ఛత్తీస్‌గఢ్



సాక్షి, హైదరాబాద్: బొగ్గు లభ్యత లేకనే ఛత్తీస్‌గఢ్ తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయడం లేదని తెలంగాణ ట్రాన్స్‌కో స్పష్టం చేసింది. బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరాను నిలుపుదల చేయడంలో వాస్తవం లేదని పేర్కొంది. మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు కొరత నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించింది. 'రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ కరెంట్ బంద్' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ట్రాన్స్‌కో యాజమాన్యం వివరణ ఇచ్చింది. 'సొంత అవసరాల బొగ్గు గని (క్యాప్టివ్ మైన్స్) నుంచి విద్యుత్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో అడ్డంకుల నేపథ్యంలో రోడ్డుతోపాటు రైలు మార్గాన్ని ఛత్తీస్‌గఢ్ వినియోగిస్తోంది. ఇతర వనరుల నుంచి కూడా బొగ్గు కొరతను ఎదుర్కొంటోంది. ఆలస్యంగానైనా మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రానికి క్యాప్టివ్ గని కేటాయింపులు జరగడంతో బొగ్గు లభ్యత చేకూరడంతోపాటు విద్యుత్ వేరియబుల్ ధర తగ్గింపునకు దోహదపడింది. దీంతో అధిక ధరలతో విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను నివారించినట్టు అయింది. తెలంగాణ ఈఆర్సీ ఉత్తర్వులకు లోబడి ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించాల్సిన బకాయిలను అంగీకరించడం జరిగింది. లేట్ పేమెంట్ సర్‌చార్జీ రూల్స్–2022 కింద ఆర్‌ఈసీ/పీఎఫ్‌సీల ద్వారా పాత బకాయిల చెల్లింపునకు ఇప్పటికే ఏర్పాట్లు చేశాం. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ స్థిర ధర (ఫిక్స్‌డ్ కాస్ట్) మినహా టారిఫ్ విషయంలో ఇతర తీవ్రమైన వివాదాలేమీ లేవు. ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఆమోదించిన స్థిర ధరను ఢిల్లీలోని అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేశాం. ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఆమోదించిన స్థిర చార్జీలను పరిగణనలోకి తీసుకున్నా, షార్ట్ టర్మ్ మార్కెట్, ఎక్స్ఛేంజీల విద్యుత్ ధరలతో పోటీపడేలానే ఉంది. విద్యుత్ ధరలను ఛత్తీస్‌గఢ్ అసాధరణంగా పెంచేసిందనడం సరికాదు. ఎందుకంటే, ఈఆర్సీ ఖరారు చేసిన టారిఫ్‌ను మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది'అని ట్రాన్స్‌కో తెలిపింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా లేకున్నా, అందుకోసం బుక్ చేసుకున్న ట్రాన్స్‌మిషన్ లైన్లకు చార్జీలు చెల్లిస్తున్న అంశంపై సైతం ట్రాన్స్‌కో వివరణ ఇచ్చింది. పవర్ ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్లతోపాటు పవర్ బ్యాంకింగ్ అవసరాలకు ఈ లైన్లను వాడుకుంటున్నట్టు తెలిపింది.

ట్రాన్స్‌కో, డిస్కంల భిన్న వాదనలు

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై తెలంగాణ ఈఆర్సీకి రాష్ట్ర డిస్కంలు ఇచ్చిన వివరాలు, 'సాక్షి' కథనంపై తెలంగాణ ట్రాన్స్‌కో ఇచ్చిన వివరణ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. బొగ్గు కొరత వల్లే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా ఆగినట్టు ఈఆర్సీకి ఇచ్చిన వివరణలో డిస్కంలు ఎక్కడా పేర్కొనలేదు. ఛత్తీస్‌గఢ్‌కి ఇవ్వాల్సిన బిల్లుల బకాయిలతోపాటు మార్వా విద్యుత్ కేంద్రం పెట్టుబడి వ్యయంపై వివాదంతోనే సరఫరా జరగడం లేదని తెలిపాయి.

Reply:

- ➢ The actual Power Purchased by TSDISCOMs from CSPDCL for FY 2021-22 is 1631 MU (availability of 19%). For H1 of FY 2022-23 the actual Power Purchased is zero from CSPDCL due to the reasons mentioned below. However for H2 of FY 2022-23 the estimated power purchase from CSPDCL is 2713 MU (under the assumption that the disputes will be resolved by then). Hence for the FY 2022-23 the overall Power purchase is estimated at 2713MU (availability of 31%).
- ➢ The Availability declared by CSPDCL to TSDISCOMs for FY 2020-21 is 39.67% with Fixed Charges claim of Rs.828.13Crores, for FY 2021-22 is 19.71% with Fixed Charges claim of Rs. 394.88Crores.

బిల్లుల బకాయిలు, వివాదాలతోనే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలంగాణ డిస్కంలు రాష్ట్ర ఈఆర్సీకి సమర్పించిన డాక్యుమెంట్

బకాయిలిచ్చే వరకు సరఫరా చేయం: ఛత్తీస్‌గఢ్



'మాకు బకాయిపడిన దీర్ఘకాలిక బకాయిలను చెల్లించేవరకు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయం. తెలంగాణకు 2023–24లో ఎలాంటి విద్యుత్ సరఫరాను పరిగణనలోకి తీసుకోబోం' అని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (సీఎస్‌పీడీసీఎల్).. ఆ రాష్ట్ర ఈఆర్సీకి తెలియజేసింది. ఈ విషయాన్ని తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)–2023–24లో పొందుపర్చింది.

CSPDCL has not considered any sale of the power of Marwa to Telangana at state periphery for FY 2023-24 as no power is supplied to Telangana state unless the state shall pay the long pending dues to CSPDCL.

దీర్ఘ కాలిక బకాయిలు చెల్లిస్తేనే తెలంగాణకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఛత్తీస్‌గఢ్ డిస్కం ఆ రాష్ట్ర ఈఆర్సీకి సమర్పించిన ఏఆర్ఆర్ నివేదికలో పేర్కొన్న అంశాన్ని ఈ ఫొటోలో చూడవచ్చు.

కవన కుతూహలం

- 27 నుంచి 29 వరకు హైదరాబాద్ సాహిత్యోత్సవం
- తరలిరానున్న కవులు, కళాకారులు, మేధావులు



సాక్షి, హైదరాబాద్: వైవిధ్యభరితమైన హైదరాబాద్ సాహితీ ఉత్సవం (హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్) 13వ ఎడిషన్‌కు నగరం సన్నద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు విద్యారణ్య స్కూల్ వేదికగా వేడుకలు జరగనున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్లపాటు నిలిచిపోయిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు హెచ్‌ఎల్‌ఎఫ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కళలు, సాహిత్యం, సంస్కృతులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ప్రతి సంవత్సరం హైదరాబాద్ సాహిత్యోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2010 నుంచి నిరాటంకంగా (కోవిడ్ కాలం మినహా) జరుగుతున్న లిటరరీ ఫెస్టివల్ అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యాన్ని గడించింది. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, భిన్న భావజాలాలు, విభిన్న జీవన సమూహాలను ప్రతిబింబించే కళారూపాలకు, సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలకు ఇది వేదికగా నిలిచింది. మూడు రోజుల పాటు సాహితీ ప్రియులను అక్కున చేర్చుకొని సమకాలీన సాహిత్య, సామాజిక అంశాలపై లోతైన చర్చలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అతిథి దేశంగా జర్మనీ..

హెచ్‌ఎల్‌ఎఫ్ 13వ ఎడిషన్‌కు జర్మనీ అతిథి దేశంగా హాజరు కానుంది. ఆ దేశానికి చెందిన పలువురు రచయితలు, మేధావులు భాగస్వాములు కానున్నారు. ప్రముఖ జర్మనీ యువ నవలా రచయిత్రి ఎవేన్‌కో బుక్కోసీ ఈ వేడుకల్లో పాల్గొంటారు. జర్మనీ కళారూపాలను ప్రదర్శించనున్నారు.

కొంకణి సాహిత్యం ఎంపిక..

ఈ ఏడాది కొంకణి భాషా సాహిత్యాన్ని భారతీయ భాషగా ఎంపిక చేశారు. గతేడాది జ్ఞానపీఠ అవార్డు పొందిన కొంకణికి చెందిన ప్రముఖ రచయిత దామోదర్ మౌజో ఈ వేడుకల్లో కీలకోపన్యాసం చేయనున్నారు. కొంకణి భాషా చిత్రాల దర్శకుడు బార్డ్‌రాయ్‌బరెట్టో పాల్గొంటారు. కొంకణి నృత్యాలు, జానపద కళలను ప్రదర్శించనున్నారు.

ప్రముఖుల ప్రసంగాలు

ప్రఖ్యాత దర్శకుడు దీప్తీ నవల్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత పాలగుమ్మి సాయినాథ్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మానస ఎండ్లూరి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నుంచి గీతా రామస్వామి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు. జర్మనీతో పాటు అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన రచయితలు, కళాకారులు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా హైదరాబాద్ చారిత్ర వైభవాన్ని, వాస్తు నైపుణ్యాన్ని ప్రతిబింబించే పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉషా ఆకెళ్ల రూపొందించిన 'హమ్ ఐసీ బాత్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.

ఇది అందరి వేడుక: ప్రొఫెసర్ విజయ్‌కుమార్



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. ఈసారి మెట్రో రైల్ ప్రత్యేక ప్రచారం నిర్వహించనుంది. ఖైరతాబాద్ నుంచి విద్యారణ్య స్కూల్ వరకు మూడు రోజుల పాటు ప్రతి 15 నిమిషాలకో ఉచిత ట్రిప్పును ఏర్పాటు చేయనుంది.

22న నాగర్‌కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవసభ

- హాజరుకానున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే
- నేడు సీఎస్‌ను కలవనున్న టీపీసీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: మార్కండేయ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా తమ పార్టీకి చెందిన దళిత, గిరిజన నాయకులపై అధికార బీఆర్ఎస్ నేతల దాడిని నిరసిస్తూ ఈనెల 22న నాగర్‌కర్నూల్ కేంద్రంగా 'దళిత గిరిజన ఆత్మగౌరవ సభ' నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సభకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో తెలంగాణలో పర్యటించనున్న ఆయన రాష్ట్ర ఇన్‌చార్జి హోదాలో ఈ సభకు తొలిసారి అతిథిగా రానున్నారు. కాగా, పంజగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలంటూ టీపీసీసీ బృందం బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి విజ్ఞప్తి చేయనుంది. పంజగుట్ట చౌరస్తా నుంచి తొలగించి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన అంబేడ్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌కు అప్పగించాలంటూ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ విగ్రహాన్ని పంజగుట్ట చౌరస్తాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనుంది. ఇందుకోసం శాంతికుమారి అపాయింట్‌మెంట్ కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే పార్టీ తరఫున లేఖ రాశారు. సీఎస్ అపాయింట్‌మెంట్ లభిస్తే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సీఎస్‌ను కలిసి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, ఎమ్మెల్యేలకు ఎర కేసుతోపాటు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడాన్ని కూడా విచారించాలని కోరనుంది.



గొంతుపై కాలుపెట్టి చంపే యత్నం చేశారు: నాగం

మార్కండేయ ప్రాజెక్టు సందర్శన కోసం వెళ్లిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తల గొంతుపై కాలు పెట్టి చంపేందుకు యత్నించారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మల్లురవితో కలిసి ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజన నేతలపై దాడులు చేయడమేకాక తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ ఆదేశిస్తే పవన్‌పై పోటీచేస్తా

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుంది
- ఏపీ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ



నగరి(చిత్తూరు జిల్లా): వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశిస్తే పవన్‌కల్యాణ్‌పై పోటీచేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ చెప్పారు. అదే సమయంలో పార్టీ నిర్ణయిస్తే 175 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి అయినా పోటీకి తాను సిద్ధమని తెలిపారు. నగరి పట్టణంలో మంగళవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలీ మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుపొందడం ఖాయమన్నారు. పవన్‌కల్యాణ్ 'రణస్థలం యువశక్తి' సభలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సాధారణమని అన్నారు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని పేర్కొన్నారు. అయితే, ఎవరు మేలు చేస్తారో ప్రజలకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి రోజాను పవన్‌కల్యాణ్ అతి విలువైన డైమండ్‌తో పోల్చారన్నారు. తన సొంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందరికీ మంచిచేస్తున్న రోజమ్మ నిజంగా కోహినూర్ డైమండే అని అలీ అన్నారు.

త్వరలో 'రెరా'కు పూర్తిస్థాయి కమిటీ

చైర్‌పర్సన్, సభ్యుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి లావాదేవీలను క్రమబద్ధీకరించేందుకు ఏర్పాటైన 'రెరా'కు త్వరలో పూర్తిస్థాయి కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగున్నరేళ్ల క్రితం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో న్యాయబద్ధమైన 'రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ' (రెరా)లను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి హోదా స్థాయి అధికారి చైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇద్దరు పూర్తిస్థాయి సభ్యులు ఉంటారు. అయితే 'రెరా'కు ఇప్పటివరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రెరాకు వచ్చే దరఖాస్తుల పరిశీలన, అనుమతులు అన్నీ ఆయన నేతృత్వంలోనే సాగేవి. కాగా రియల్ వెంచర్లు, ఫ్లాట్ల నిర్మాణంలో 'రెరా' నిబంధనలకు తిలోదకాలిచ్చి పలు సంస్థలు, రియల్ వ్యాపారులు దందా సాగిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో 'రెరా'కు పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ పురపాలక శాఖ ఆసక్తి, అర్హత గల వారి నుంచి చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తును ఆహ్వానించింది. ఫిబ్రవరి 17వ తేదీలోగా దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని కోరింది. రెరా వెబ్‌సైట్, తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారులకు అవసరమైన అర్హతలు, వేతనం వివరాలన్నీ ఉన్నాయి.

సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం



మన్ననూర్: సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చునని వయస్సు ఎంత మాత్రం అడ్డంకి కాదని బీహార్ రాష్ట్రానికి చెందిన స్వామిజీ అరుణ్ జోషీ న్నారు. దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం పుణ్యక్షేత్రంను దర్శించుకునేందుకు సైకిల్ యాత్రగా వెళ్తున్న ఆయనను మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా యాత్రను ఉద్దేశించి మాట్లాడారు. గతేడాది నవంబర్ 4న బీహార్ రాష్ట్రం నుంచి బయలుదేరినట్లు తెలిపారు. శరీరంలో సత్తువ ఉన్నంత వరకు జ్యోతిర్లింగాలను మొత్తంగా దర్శించుకోవాలనేది ఉద్దేశ్యం అన్నారు. అదేవిధంగా లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహీం, శేఖర్, శ్రీనివాసులు, నరేష్, నర్సింహ, శివాజీ, పర్వతాలు, జయమ్మ, శివలీల పాల్గొన్నారు.

కోమటికుంట కబ్జాపై సర్వే చేపట్టాలి

కొత్తకోట: పట్టణ శివారులోని బ్రహ్మంగారి ఆలయం వెనకాల గల ప్రభుత్వ భూమి అయిన కోమటికుంట కబ్జాపై అధికారులు వెంటనే సర్వే చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెబ్బేరులోని నీటిపారుదలశాఖ కార్యాలయంలో పర్యవేక్షణ ఇంజినీరు సత్యాశీలారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కోమటికుంటను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సర్వే నెంబర్లు 515, 487లో దాదాపు 3 ఎకరాల విస్తీర్ణంలో కోమటికుంట ఉండేదని, ప్రస్తుతం నీటిపారుదల శాఖ రికార్డుల్లో 173 మీటర్లే కట్ట ఉన్నట్లు వివరాలు నమోదు అయ్యాయని తెలిపారు. చుట్టు పక్కల భూములను కొనుగోలు చేసి కుంటలను కలిపేసుకొని వెంచర్లు చేసి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని తెలిపారు. కుంట ఆక్రమణపై విచారణ చేయాలని అన్నారు.



రాష్ట్రంలో నిజాం పాలన



మాట్లాడుతున్న జయశ్రీ

నారాయణపేట రూరల్: తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ నిజాం నిరంకుశపాలనను కొనసాగిస్తున్నారని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ అధికార ప్రతినిధి రోజారమణి, మహిళామోర్చా ఇన్‌చార్జ్ జయశ్రీ విమర్శించారు. పట్టణంలో ఆర్‌పీఆర్ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళామోర్చా సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. రోజు రోజుకు మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, ప్రతి సంఘటనలో అధికార పార్టీ నేతల హస్తం ఉంటుందని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని, బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలోనూ ఎంతో మంది అమాయకపు మహిళలు ప్రాణాలు కోల్పోయారన్నారు. మహిళలు చైతన్యం కావాలని, సమాజాన్ని మొల్కొలిపి గులాబీ నేతల అకృత్యాలను బయటపెట్టి దోషిగా నిలబెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి మద్దతు కూడగట్టాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మిగులు రాష్ట్రంగా ఆవిర్భవించి అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌ను ఇంటికి పంపాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో మహిళా జూనియర్, డిగ్రీ కళాశాల, మహిళలకు వడ్డీలేని రుణాలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఆస్పత్రుల్లో సౌకర్యాలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను కాలగర్భంలో కలిపేస్తాం

- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతం
- ఈనెల 22న దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి, ప్రీతం

కందనూలు: ఎస్సీ,ఎస్టీలను లక్ష్యంగా పోలీసులను అడ్డంపెట్టుకొని వేధిస్తే బీఆర్ఎస్‌ను కాలగర్భంలో కలిపేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతం హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి వారి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు పోలీసులను అడ్డం పెట్టుకొని దళిత, గిరిజనుల హక్కులను హరిస్తూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న పాలకులు రానున్న ఎన్నికల్లో కనుమరుగవుతారన్నారు. తమ పార్టీకి చెందిన కార్యకర్తలు వాల్యా నాయక్, విద్య రాములుపై దాడి చేసిన వారిని ఈనెల 22లోపు అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే, అదేరోజు బిజినేపల్లి మండలంలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభలో ఇందుకు ప్రోత్సహించిన ఎమ్మెల్యే ఇంటి వద్ద చావు డబ్బు కొడతామని అన్నారు. మాజీ మంత్రి ప్రాజెక్టు సందర్శించిన సమావేశంలో అధికార పార్టీ గుండాలు చేసిన దాదాగిరిపై ఇంత వరకు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించకపోవడం సిగ్గుచేటన్నారు. దళితులపై తరచూ దాడులు చేస్తున్నా కనీసం కలెక్టర్ స్పందన లేదని విమర్శించారు. మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 22న బిజినపల్లి మండల కేంద్రంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే సభకు రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాక్రే, రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్కతో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళిత, గిరిజన సమాజం పెద్ద ఎత్తున్న పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, భారతి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థాన పాలక మండలి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్, కమిటీ సభ్యులు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్ ఎంపీ రాములు, మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందజగన్నాథం, స్పోర్ట్ అథారటీ చైర్మన్ ఆంజనేయులుగౌడులను కలిశారు. 26న వసంతపంచమి రోజు జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం, సహస్ర ఘట్టాభిషేక కార్యక్రమం ఉంటుందని ఆహ్వాన పత్రికలు, అమ్మవారి క్యాలెండర్, ప్రసాదాలు శేషవస్త్రాలను వారికి అందజేశారు.

ప్రసాద్ స్కీం పనులపై మంత్రి, ఎంపీ ఆరా

అలంపూర్ పుణ్యక్షేత్రంలో చేపడుతున్న ప్రసాద్ స్కీం పనులు ఎంతవరకు వచ్చాయని మంత్రి శ్రీనివాస్ గౌడు, ఎంపీ రాములు ఆరా తీశారు. ఎంపీ కేంద్ర పురాతత్వ శాఖ సూపరింటెండెంట్ స్మితకు ఫోన్ చేసి ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు.

హైదరాబాద్, బెంగళూరు జట్లు శుభారంభం



బెంగళూరు బౌలర్ దాటికి బౌల్డ్ అయిన బీహార్ ఆటగాడు

గద్వాల: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరిగా సాగుతున్నాయి. మూడో రోజు హైదరాబాద్, బెంగళూరు జట్లు శుభారంభం చేశాయి. నాటా సహకారంతో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైమ్ మినిస్టర్ కప్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. మంగళవారం స్థానిక సోమనాద్రి స్టేడియంలో మొదటి టీ–20 మ్యాచ్‌లో జార్ఖండ్- హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్ల దాటికి జార్ఖండ్ జట్టు 15.5 ఓవర్లలో కేవలం 68 పరుగులు చేసి కుప్పకూలింది. 69 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 5ఓవర్లలోనే 70 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన చాంద్‌బాషాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. మధ్యాహ్నం రెండో మ్యాచ్‌లో బెంగళూరు– బీహార్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 20 ఓవర్లలో 176 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన బీహార్ జట్టు 135 పరుగులకే ఆలౌట్ అయింది. 42 పరుగుల తేడాతో బెంగళూరు జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నవీన్‌కు లభించింది.



ప్రయాసంగా.. తిరుగు ప్రయాణం

సంక్రాంతి సెలవులు ముగియడంతో జనం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో మంగళవారం మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. హైదరాబాద్ బస్సు వచ్చిన వెంటనే సీట్ల కోసం ఫీట్లు చేయాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు అదనపు బస్సులు నడిపినా.. రద్దీ ఎక్కువగా ఉండడంతో అవి సరిపోలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



